

# ఇది ప్రసంగం - అది ప్రపంచం

కందుకూరి వెంకట మహాలక్ష్మి

కళాశాల వార్షికోత్సవాలకి ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రంగు రంగుల దుస్తులతో విద్యార్థీ విద్యార్థినులు ఇటు అటు హడావుడిగా తిరుగుతున్నారు. విద్యార్థినులు ఒలికించే నవ్వుల పువ్వుల్ని ఏరుకుని విద్యార్థులు వారి హృదయాల్లో పదిలపరుచుకుంటున్నారు. అలాగే ఇటు అమ్మాయిలు.

పండుగలా గున్న ఆ ప్రాంగణంలో రంగ వల్లులు అమ్మాయిలు దిద్దుతుంటే, తోరణాలు అబ్బాయిలు కడుతున్నారు. ఇలా కలిసి మెలిసి చేస్తున్న ప్రతి పనిలోనూ వారికి ఎంతో ఆనందం, ఉత్సాహం కలుగుతోంది.

ఉదయం పది గంటలకి ప్రారంభమయ్యే కార్యక్రమాలలో మొదటగా ఆ కాలేజీ విద్యార్థులు, విద్యార్థినులు ప్రదర్శిస్తున్న ప్రోగ్రాములే ఎక్కువ.

హాలంతా కాలేజీ స్టాఫ్‌తో, అతిథులతో నిండి ఉంది.

అధ్యక్షులవారి తొలిపలుకుల తరవాత కార్యదర్శి వచ్చి కార్యక్రమ వివరాలు చెప్పి, కార్యక్రమాలలో మొదటిది డిబేట్ కాంపిటీషన్ అనీ, దానికి ఇచ్చిన విషయం 'ప్రేమ వివాహాలు సఫలమవుతాయా? లేక పెద్దలు కుదిర్చినవా?' అన్న అంశం మీద అనీ, రూల్సు చెప్పి స్టేజి దిగాడు.

కాంపిటీషన్‌కి ఆహ్వానితులైన న్యాయ నిర్ణేతలు ముందు వరుస కుర్చీల్లో కూర్చుని వారి వారి కలాలు తీసి మార్కులు వెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. కాంపిటీషన్‌లో పాల్గొనదలచిన వారు జతలు జతలుగా వచ్చి మాట్లాడారు. చివరగా వల్లభ, దివ్యలు వచ్చారు. ఇద్దరూ డిగ్రీ ఫైనలియర్‌లో ఉన్నారు.

మైక్ ముందు కొచ్చిన వల్లభ సభకి, సభ నలంకరించిన పెద్దలకి నమస్కరించి మాట్లాడటం ప్రారంభించింది.

"తల్లి తండ్రులు ఎప్పుడూ బిడ్డల భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకుని ఏ పనన్నా చేస్తారన్నది ఒప్పుకోవలసిందే. దూరదృష్టితో ఆలోచించి, బిడ్డల జీవితాలని మంచి మార్గంలో మలచాలని పెద్దలు చేసే వివాహాలే ఎల్లప్పుడు సఫలమవుతా యన్నది నూరుపాళ్లు నిజం. అనుభవశాలురుగా ఆలోచించి పెళ్లి సంబంధాలు చూసి, ఆ కుటుంబ వివరాలు, మంచి చెడ్డలు తెలుసుకుని ముందుడుగు వేస్తారు

పెద్దవాళ్లు. ప్రేమ వివాహాలు ఏకపక్షంగా ఉంటాయి. దూరపాలోచన ఉండదు కాబట్టి ప్రేమ వివాహాల కన్నా పెద్దలు చూసి చేసిన వివాహాలే మంచి వంటూ" వాటికి ఎన్నో ఉపమానాలు చెప్తూ చాలా చక్కగా మాట్లాడింది వల్లభ.

వల్లభ ఉపన్యాసాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ మాట్లాడింది దివ్య.

"కాలాన్ని బట్టి మనమూ మారాలి. పెళ్లిళ్ల పేరిట అయ్యే దూబరా ఖర్చులు తగ్గాలంటే ప్రేమ వివాహాలు ఎంతో అవసరం. కొంద రాడపిల్లల తండ్రులు ఇళ్లు, వాకిళ్లు అమ్మి ఆడపిల్లల పెళ్లిళ్లు చేస్తున్నారు. ఈ దురాచారాలు పోవాలంటే ప్రేమ వివాహాలే మంచివి. పెళ్లి అనేది ఒక ఆడ, ఒక మగ అనే ఇద్దరి మధ్య బంధం. అది అనురాగ బంధం కావాలంటే ఆ స్త్రీ పురుషులు ఒకరి నొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలి. ఆ అవకాశం పెద్దలు కుదిర్చే వివాహాల్లో అరుదు. కాబట్టి ప్రేమ వివాహాలే మంచివి. దీని వల్ల అనాదిగా మనలో నాటుకు పోయిన దురాచారాలు, చాదస్తాలు పోవడమే కాకుండా స్త్రీ పురుషులు ఇద్దరు కొంతకాలం కలిసి మెలిసి ఉండడం వల్ల ఒకరి అభిప్రాయల్ని మరొకరు అర్థం చేసుకోగలుగుతారు. ఈ అవకాశం పెద్దలు కుదిర్చే వివాహాల్లో కుదర"వంటూ ఇంకా ఎన్నో ఉపమానాలతో ఎంతో ఇంపుగా ఉపన్యసించింది దివ్య.


హాలంతా చప్పట్లతో మారుమోగింది. ఇద్దరి వాగ్ధోరణీ వింటున్న జడ్జెస్ కూడా కలాలు మూసి ఎంతో ఉత్సాహంగా, శ్రద్ధగా వారి వాదనల్ని విన్నారు.

ఒకరిని మించి ఒకరు మాట్లాడటమే కాకుండా ఆ భాషా, చెప్పే తీరు, వాటిలోని పాయింట్లు ఇద్దరివీ పోటీ పడ్డాయి.

చివరని జడ్జీలు వేసిన మార్కులు చూడగా ఇద్దరివీ సమానంగా ఉన్నాయి. ఎవరికి ఫస్టు ప్రైజు ఇవ్వాలో నిర్ణయించడానికి లాటరీ తీశారు. వల్లభకి ఫస్టు ప్రైజు, దివ్యకి సెకెండ్ ప్రైజు ఇచ్చారు. చివరగా జడ్జీలు వారి ఉపన్యాసాల్ని మెచ్చుకుంటూ, పొగడి, అభినందించారు.

దివ్య, వల్లభలు ఉండేది ఒకే హాస్టల్‌లో. ఇద్దరూ రోజు కొకసారైనా ఎదురు పడుతూనే ఉంటారు. వారి పరిచయం మాత్రం 'హాయ్!హలో!' అనుకునే కంటే ఎదగలేదు. ఇద్దరూ ఒక చోట కలిసినా మాట్లాడుకోవటం తక్కువ. దానికి కారణం వారిద్దరివీ భిన్నమనస్తత్వాలు కావడమే!

వల్లభ సనాతనాచారాలని గౌరవించడం, దివ్య ఆధునిక మార్గంలో నడవడమే కాకుండా - ఒకరి పద్ధతులు మరొకరికి నచ్చక స్నేహాన్ని పెంచుకోలేదు.




ఈ డిబేట్ తరువాత వారి పరిచయం కాస్త ముందుకు నడిచింది. ఇప్పుడు కాస్త కలిసి కబుర్లు చెప్పుకోవడం, అప్పుడప్పుడు కలిసి బైట కెళ్లడం దాకా ఎదిగింది.

ఫైనలియరు పరీక్షలయి ఎవరి సామాన్లు వారు సర్దుకుని, ఎవరిళ్లకి వాళ్లు ప్రయాణాలవుతున్నారు. దివ్య వల్లభ రూంలోకి వచ్చి చిన్న కానుక బహుకరించి తన అడ్రస్ ఇచ్చి, వల్లభది తీసుకుని కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్లింది.

కొందరి మధ్య స్నేహం ఒక చోట ఉన్నప్పటి కంటే వారు విడిపోయాకనో, విడిపోయేముందో ఎక్కువవుతుంది. అదే జరిగింది వీరి మధ్య. దివ్య, వల్లభ అప్పుడప్పుడు ఉత్తరాలు రాసుకుంటూ, అందులో ఎన్నో విషయాలు చర్చించుకునేవారు.

వల్లభ డిగ్రీతో చదు వాపేసింది. తల్లితండ్రులు సంబంధాలు చూసి పెళ్లి చెయ్యాలని నిర్ణయించారు. దివ్య మాత్రం పి.జి.లో చేరినట్లు ఉత్తరం రాసింది.

కొన్నాళ్ల తరువాత వల్లభ పంపిన శుభలేఖ చూసి దాని అభిప్రాయాల ననుసరించే తల్లి తండ్రులు కుదిర్చిన పిల్లాడిని శాస్త్రోక్తంగా పెళ్లి చేసుకుంటోం దన్నమాట స్టుపిడ్ గర్ల్ అనుకుంది దివ్య.

పరీక్షల ముందు ముహూర్తం కావడంతో గ్రీటింగ్స్ మాత్రం పంపి ఊరుకుంది. పి.జి. అయ్యాక దివ్య ఉద్యోగంలో చేరింది.

సంసార తాపత్రయంలో పడ్డ వల్లభ, ఉద్యోగంలో చేరిన దివ్య మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా కొంచెం తగ్గాయి. మొదట్లో రాసే ఉత్తరాల్లో వల్లభ తన కొత్త సంసారపు అనుభవాలని రాస్తుంటే, దివ్య తన ఉద్యోగానుభవాలని వివరిస్తూ రాసేది.

మరో రెండు వసంతాలు గిర్రున తిరిగి పోయాయి. చాలాకాలం తరువాత దివ్య రాసిన ఉత్తరం అందుకుని వల్లభ కవరు చింపి ఆత్రుతగా చదవసాగింది. తాను తన భావాల ననుసరించి ప్రేమ వివాహం చేసుకోబోతున్నానని, తన ప్రియుని తల్లితండ్రులు తమ వివాహానికి అంగీకరించటం లేదని, కానీ ఆరు నూరైనా నూరు ఆరైనా తన్నే వివాహం చేసుకుంటానన్నాడని, ప్రస్తుతం మేము తరుచు కలుసుకుంటూ ఒకరి అభిప్రాయాలు ఒకరం తెలుసుకుంటున్నామని, అతను నా భావాలకి తగ్గ వ్యక్తేనని, త్వరలోనే సింపుల్‌గా పెళ్లి చేసుకోబోతున్నామని రాసిన ఉత్తరం చదివి - "ఎంతయినా పట్టుదల గల మనిషి, అన్నమాట చెల్లించుకుంటోంది. ఎలాంటి పెళ్లయితే నేమిటి సుఖంగా ఉంటే చాలు" అనుకుంది వల్లభ. అవే విషయాలని తన ఉత్తరంలో పొందు పరచి జవాబు రాసింది.

కాలం మళ్లీ కాళ్లకి చక్రాలు కట్టుకున్నట్లు పరిగెత్తింది. ఈ మధ్యకాలంలో వారి మధ్య మళ్లీ ఉత్తరాలు తగ్గాయి. దానికి కొంత కారణం ప్రత్యేకించిన విశేషాలు రాసేవి ఏమీ లేకపోవడమో, బరువు బాధ్యతలతో తీరిక లేకో అయుండాలి.

ఆఫీసు నుంచి వచ్చిన దివ్య పోస్టు బాక్సులోని ఉత్తరాలు చూస్తూ వస్తోంది. అందులో ఒక కవరు వెనుక వల్లభ అడ్రస్ చూడగానే మనసు ఆనందంతో పరవళ్లు తొక్కింది. లోపలికి వచ్చి ముందుగా ఆ ఉత్తరం చింపి చదవసాగింది. అందులో తను ఢిల్లీ వచ్చినట్లు, ఫలానా అడ్రస్ ఇంట్లో ఉంటున్నట్లు రాసింది. చదివి ఆనందం పట్టలేకపోయింది.

అయితే వల్లభ భర్తకి ఢిల్లీ బదిలీ అయిందన్న మాట అనుకుని, మనసు ఆమెను కలవాలని తొందర చెయ్యగా, ఆ మర్నాడు సాయంకాలమే ఆఫీసులో ఓ గంట ముందు పర్మిషన్ తీసుకుని

## గమనిక

**18-9-1996 సంచిక నుండి ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పోటీల్లో పాల్గొనే పాఠకులందరూ పోటీల కోసం తపాలా శాఖవారు ప్రత్యేకించిన రెండు రూపాయల విలువ చేసే కార్డుల మీదనే రాయాలని కోరుతున్నాము. గతంలో వలె పదిహేను పైసల కార్డుల మీద రాసి పంపినా, గడి-నుడి కూపనులు అంటించి పంపినా స్వీకరించము అని గమనించాలి.**

**- సంపాదకుడు**

వల్లభ రాసిన అడ్రస్ వెతుక్కుంటూ బయలు దేరింది. కరోల్‌బాగ్‌లో ఓ మారుమూల ప్రాంతంలో ఉం దా ఇల్లు. అతి కష్టం మీద ఆ ఇల్లు తెలుసుకోగలిగి, రెండంతస్తులు ఎక్కి వెళ్లేసరికి తలుపు తాళం పెట్టి ఉండడంతో, నిరుత్సాహంగా దిగి వచ్చి ఇంటివాళ్ల నడిగింది. ఆఫీసునుంచి వచ్చేసరికి రోజూ ఆరుగంటలు దాటుతుందని చెప్పేసరికి దివ్య ఆశ్చర్యంతో "వల్లభ ఉద్యోగం చేస్తోందా?" అని మళ్లీ అడిగి, అవుననగానే వల్లభ ఉద్యోగం చెయ్యడమేమిటి అని తనని తానే ప్రశ్నించుకుంటూ, "మరో గంట పోయాక వస్తా" నని చెప్పి మార్కెట్ వైపుకి వెళ్లింది.

మళ్లీ వచ్చేసరికి వంట ప్రయత్నంలో ఉన్న వల్లభ దివ్యని చూస్తూనే ఆప్యాయంగా పలకరించి, మోడాలో కూర్చోబెట్టింది. ఓ గదీ వంటిల్లు పోర్షన్ అది. వల్లభని, ఆ ఇంటి వాతావరణాన్ని చూస్తే ఆమె ఏదో ఇబ్బందుల్లో ఉన్నట్టు అనిపించింది. మనిషి బాగా చిక్కింది. మాటల్లో కూడా ఇది వరకటి హుషారు లేదు. చాలా మార్పు కనపడుతోంది.

లోపలికెళ్లి కాఫీ తెచ్చిన వల్లభనే చూస్తూ "ఏమిటోయ్! ఉద్యోగంలో చేరావుట! ఎక్కడ? ఏం ఉద్యోగం? మీ వారెక్కడున్నారు?" అంటూ వేస్తున్న ప్రశ్నలకి "నేను బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నానోయ్! ఇక్కడ ఒక్కర్తినే ఉంటున్నాను. ఇంక మా వారి విషయం అంటావా - మేము రెండేళ్లనుంచి వేరే ఉంటున్నాము. త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నాం. మా నాన్నిచ్చిన లక్షరూపాయల కట్నానికి ఆశించి అతని తల్లి తండ్రులు నన్ను ఆయన పీకకి కట్టారుట. తనకి ఇష్టం లేని పెళ్లిట. అంతేకాదు... ఆయనకి చెడు అలవాట్లు, చెడు తిరుగుళ్లు, అక్రమ సంబంధాలు ఉన్నాయి. ఇటు మావారు నాతో సరిగ్గా ఉండక పోవడం, అటు ఆశపోతులైన నా అత్త మామలు నా పుట్టింటి నుంచి ఇది తే, అది తే అంటూ బాధించడంతో నేను విసిగిపోయి, విరక్తి కలిగి ఆ ఇల్లు విడిచేసి వచ్చేశాను. కొన్నాళ్ల క్రితం నాన్న, అమ్మా పోయారు. అన్నదమ్ముల మీద ఆధార పడటం ఈ రోజుల్లో ఏం భావ్యం చెప్పు! అందుకు ఉన్న డిగ్రీకి తగ్గ ఉద్యోగాలకి అప్లై చేయగా అదృష్టవశాత్తు ఈ బ్యాంకిలో ఉద్యోగం వచ్చింది. నా భర్త వాళ్ల వాళ్లకీ దూరంగా ఉండాలని ఇక్కడికి పోస్టింగ్ వేయించుకుని వచ్చేశాను. ఇవీ నా గురించిన విషయాలు, విశేషాలు. దివ్యా! ను వ్వా రోజు అన్న మాటలు అక్షరాలా నిజమని ఈ రోజు ఒప్పుకుంటున్నాను. పెద్దవాళ్లు కుదిర్చిన వివాహాల్లోనూ ఎంతో దగా, మోసం ఉంటాయి. ముఖ్యంగా తల్లితండ్రులు కొడుకుల అభి ప్రాయాల్ని తెలుసుకోకుండా, కొందరు తెలిసినా వారి పెద్దరికాలతో పిల్లల నోరు నొక్కి, అణిచేసి, డబ్బాశతో కొడుకులకి పెళ్లి చేసి ఎందరోనా లాంటి ఆడపిల్లల గొతుకలు కోసి, వారి జీవితాల్ని నాశనం చేస్తున్నా"రంటూ ఎంతోసేపు వాపోయింది.

అంతా విన్న దివ్య బాధతో గిలగిల్లాడి పోయింది. "నేనయితే వెంటనే వాళ్లని హత్యచేసి బైటికొచ్చేసేదాన్ని. నీలా ఇలా కాళ్లూ చేతులూ ముడుచుకుంటే మనకి జరిగేదిదే" అంది ఆవేశం కట్టలు తెంచుకురాగా.

"సరే నా సొదకేం గానీ నీ గురించి చెప్పు. ప్రేమించి పెళ్లి చేసుకున్నావు. హాయిగా ఆనందంగా నీ జీవితం సాగిపోతుంది కదా?" అంటూ దివ్య ధోరణిని, మూడ్‌ని మార్చడానికి మాట మార్చింది వల్లభ.

తన జీవితం ఎంతో ఆనందదాయకంగా ఉందని, తమ వివాహం ఇటీవలే సింపుల్‌గా దండలు మార్చుకుని రిజిస్ట్రీ చేసుకోవడంతో జరిగి పోయిందని, తన భర్తకి ఇంకా ఈ ఊరు బదిలీ కానందున సెలవులకి వస్తూ పోతూ ఉంటాడని, తనూ సెలవులకి వెళ్తూ ఉంటానని చెప్తూ 'దంపతులు దూరంగా ఉండి ఒకరి కోసం ఒకరం ఎదురు చూడటంలో ఉన్న ఆనందం, ఎడబాటు తరువాత కలవగానే కలిగే సంతోషం వర్ణనాతీతం' అంటూ పూలపాన్పు లాంటి తన జీవిత పుటల్ని విప్పి చెప్తుంటే -

"అదృష్టవంతురాలివే దివ్యా! నువ్వన్నట్టు కాలంతో మనమూ మారాలి. నే నోడిపోయాను. నువ్వే గెలిచావు. ఆనాడు డిబేట్‌లో ఫస్టు ప్రైజు నా కిచ్చారు. కానీ దానికి నేను అర్హురాలిని కాదని ఈ రోజే తెలిసింది" అంటూ చెప్తున్న వల్లభ మాటల్ని మార్చాలని కాలేజీ రోజుల్నాటి స్నేహితుల వైపుకి మాటల్ని మళ్లించింది దివ్య.

మాటలు కాలాన్ని తెలియనివ్వనట్లు టైము ఎనిమిది దాటింది. వల్లభ బలవంతం మీద ఆ పూట అక్కడే భోజనం చెయ్యడానికి ఒప్పుకుంది దివ్య.

వంట పూర్తి చెయ్యడానికి లోపలకెళ్లింది వల్లభ. ఏమీ తోచని దివ్య బల్లమీద పుస్తకాలని అటూ ఇటూ తిప్పుతూ కూర్చుంది.

"వంటయింది భోం చేద్దామా దివ్యా!" అంటూ హాల్లోకొచ్చిన వల్లభ దివ్యని చూసి స్థాణువులా నిలబడిపోయింది. దివ్య నేలమీద స్పృహతప్పి పడి ఉంది. ఏం చెయ్యాలో తోచని వల్లభ నీళ్లు తెచ్చి ఆమె ముఖం మీద జల్లి ఫాన్ స్పీడు పెంచింది. చమటతో తడిసి శరీరం, కాళ్లూ చేతులు చల్లబడతున్నాయి. ఇంటివాళ్లని పిల్చి డాక్టర్‌ని పిలిపించింది. డాక్టర్ వచ్చి మందులు, ఇంజక్షన్ లిచ్చి కంగారు పడవలసిందేం లేదని రాత్రికి తెలివి వస్తుందని చెప్పి వెళ్లిపోయాడు.

డాక్టర్ చెప్పిన ప్రకారం రాత్రికి దివ్య లేచింది. అంతదాకా దివ్య గురించి కంగారుపడుతున్న వల్లభని చూసి "సారీ నిన్ను చాలా గాబరా పెట్టి, స్థిమితం లేకుండా చేశాను. ఈ మధ్య నా కలాగే ఫిట్సు వస్తున్నాయి" అంటూ నీరసంగా ఉన్నా లేచి కూర్చోబోతున్న దివ్యని వారించింది. మర్నాడు ఆమెని ఇంటివద్ద ఆటోలో దింపి ఆఫీసుకెళ్లింది.

దివ్య క్షేమ సమాచరాలు కనుక్కుందామని మరో నాలుగు రోజుల తరువాత ఆమె ఇంటికి ఆఫీసు నుంచి వెళ్లిన వల్లభకి దివ్య ఇల్లు తాళం పెట్టి ఉండటంతో, పక్కవాళ్లని అడగగా ఊరెళ్లిందని చెప్పడంతో భర్త దగ్గరకి వెళ్లి ఉంటుందనుకుని ఇంటికి వచ్చేసింది.

టీ తాగుతూ ఆ రోజు వచ్చిన ఉత్తరలని చూస్తున్న వల్లభకి అందులో దివ్య రాసిన కవరు

కనబడగానే ఊళ్లో ఉండి, నాలుగు రోజులకోసం భర్త దగ్గర వెళ్లిన ఈ పిల్ల ఉత్తరం ఎందుకు రాసిందట? ఏమన్నా విశేషమా? అంటూ ఆ కవరు చింపి చదవసాగింది.

"డియర్ వల్లభ!

నా ఈ ఉత్తరం చూసి ఆశ్చర్యపోతున్నావు కదూ! ఈ ఉత్తరం పూర్తిగా చదివితే ఎందుకు రాశానో నీకే అర్థమవుతుంది.

"వల్లభా! చాలా ఏళ్ల తరువాత నిన్ను చూశానన్న ఆనందం నీ జీవిత చరిత్ర విన్నాక సగం మాయమయింది. నీ గురించి నువ్వు చెప్తున్నప్పుడు నాలో ఉప్పొంగిన ఆవేశం, ఆవేదన ఎలా వెళ్ల డించను? నేనే అయితే ఆ రాక్షసుడిని హత్యచేసి ఉండేదా న్ననుకున్నాను. ఇక్కడ కూడా నువ్వు ఆ సనాతనాచారలనే పట్టుకు వేళ్లాడుతూ చాలాకాలం ఓర్చుకుని ఇక సహించలేని పరిస్థితుల్లో ఇల్లొదిలి వచ్చేశానన్నావు. అదే నేనయితే గంటసేపు కూడా ఆ ఇంట్లో నిలబడక పోదు ననిపించింది. నీగురించి ఓ పక్క జాలి, బాధ పడటమే కాదు, కోపం కూడా కట్టలు తెంచుకొచ్చింది. కానీ... కానీ... ఏదన్నా తనదాకా వస్తే గానీ తెలిసిరా దన్నారు పెద్దలు. ఉన్నట్లుండి ఈ సామెత ఏమిటని ఆశ్చర్య పోతున్నావా? వల్లభా! నీ కో షాకింగ్ న్యూస్ రాస్తు న్నాను - నువ్వే కాదు... పెళ్లి పేరిట మోసపోయింది నీలా నేనూ ఈ దేశంలో దగా పడ్డ ఆడవాళ్లలో ఒకర్తి నని ఈ మధ్యే తెలుసుకున్నాను. నువ్వు నీ గురించి చెప్పినప్పుడు నాలో ఎంతో ఆవేశం, కోపం కలిగాయి. కానీ నా గురించి నేను తెలుసుకోగానే ఆవేశం, కోపం కన్నా ముందు నీరసం కమ్మి, దెబ్బతిన్న మేకలా నేల కూలిపోయాను. ఆ ఆవేశం ఏది? ఆ కోపం ఎక్కడికి పోయింది? ఏదన్నా చెప్పడం తేలిక - చెయ్యడం చాలా కష్టం. ఆ వ్యక్తిపై అసహ్యం, ద్వేషం శరీరమంతా నిండిపోయి, ఆ బంధమంటేనే జుగుప్స కలిగి శెలవు పెట్టి ఈ సుదూర ప్రాంతాలకి వచ్చేశాను.

వల్లభా! ప్రేమ వివాహాలు సుఖమయం అవుతాయని, పెద్దలు చేసినవి దుఃఖమయ మవుతాయని వాదించిన నాకు ఇదొక పెద్ద ఎదురు దెబ్బ. నేను ప్రేమించి రిజిస్టర్డు మారేజ్ చేసుకున్న నా భర్త మోసగాడు, వంచకుడు అని తెలిసింది. అతనికి ఇది వరకే పెళ్లయి, భార్య ఉంది. ఆ విషయాలేవీ నాతో చెప్పకుండా దాచిపెట్టి, నన్ను తను ప్రేమిస్తున్నట్లు నటించి మోసం చేశాడు. ఇటీవలే పై నిజాన్ని తెలుసుకున్న నా మనసు ముక్కలుముక్కలయింది. నా నిర్ణయం ఎన్నడూ తప్పవదు అన్న నమ్మకంతో ఉన్న నేను మొగుడనే ఓ మోసగాడి చేతుల్లో చిత్తుగా మోసపోయాను. ఆ అవమానం, బాధతో మనశ్శాంతిని కోల్పోయాను. అందుకే శెలవు పెట్టి ఈ మారుమూల ప్రాంతానికి వచ్చేశాను. బహుశా నేను తిరిగి ఢిల్లీకి రాకపోవచ్చు వీలయినంత త్వరగా వేరే ఊరికి బదిలీ చేయించుకుంటాను. వలభా! ఆ దొంగ ప్రేమికుడు కొట్టిన దెబ్బవల్ల తెలుసుకున్నదేమిటంటే - పెద్దలు కుదిర్చిన పెళ్లిల్లే కాదు, ప్రేమ వివాహాలు కూడా అన్నీ సఫలం, ఆనందమయం కావు అన్నది. మోసాలు, అన్యా యాలు రెండు రకాల పెళ్లిళ్లలోనూ జరుగు తాయన్న దానికి నిదర్శనం మనిద్దరి జీవితాలే! డిబేట్‌లకి, ఉపన్యాసాలకి, నిజ జీవితాలకి చాలా తేడా ఉంటుంది. అలాగే ఆవేశపడటం చాలా సులువు- దాన్ని ఆచరణలో పెట్టడం అంత తేలిక కాదు.

నిన్నగాక మొన్న నీ ఇంటికొచ్చినప్పుడు నా జీవితం మూడు పువ్వులు, ఆరు కాయల్లా ఉందంటూ ఎంతో గొప్పగా చెప్పిన నేను ఇవాళ ఇలాంటి ఉత్తరం రాయడమేమిటని ఆశ్చర్య పోతున్నావు కదూ? అసలు నా భర్త మోసగాడని తెలిసింది నీ ఇంటికొచ్చిన రోజే! ఇంకా వివరంగా చెప్పాలంటే నీ ఇంట్లోనే!!

నువ్వు వంట చేస్తుండగా కాలక్షేపానికి నేను నీ బల్లమీదున్న పుస్తకాలు చూస్తుంటే నీ అల్బమ్ కనపడింది. తీసి చూస్తుంటే అందులో నీ పెళ్లినాటి ఫోటోలు కనపడ్డాయి. మీ భార్యా భర్తలు తీయించు కున్న ఫోటోలు చూడగానే నా గుండె లయ తప్పింది. నువ్వు వస్తున్న అలికిడి కాగానే నేను గబగబా ఎక్కడివక్కడ సర్దేసి వస్తుండగా నాకు గుండెల్లో నొప్పిలా వచ్చి, బాధ తట్టుకోలేక కళ్లు తిరిగి స్పృహ తప్పి పడి పోయాను. ఆ క్షణంలో నాకు నిజం చెప్పే ధైర్యం చాలక ఫిట్సు వస్తున్నా యని నీతో అబద్ధం చెప్పాను.

వల్లభా! నిన్ను శాస్త్రోక్తంగా పెళ్లి చేసుకుని దగా చేసిన మోసగాడే, నన్ను ప్రేమ పేరుతో రిజిస్టరు మారేజ్ చేసు కున్న వంచకుడు. అంటే- నువ్వు సనాతన పద్ధతుల్లో గోతిలోకి దిగావు, నేను ఆధునిక పద్ధతిలో ఉచ్చు తగిలించు కున్నావన్న మాట!

వల్లభా! ఇలాంటి దగాకొరుల్ని, నీచుల్ని మనం వదలకూడదు. దేశంలో ఉన్న ఇలాంటి వారందర్నీ మనం సవ్యమైన మార్గంలో పెట్టలేకపోయినా, మన చేతికి చిక్కిన వారికి బుద్ధి చెప్పాలి. నువ్వింకా విడాకులు తీసుకోలేదు గనక, నీకు విడాకు లివ్వకుండా నన్ను రిజిస్టరు మారేజ్ చేసుకున్న నేరం మీద ఆ దుర్మార్గుడిని కోర్టు కీడ్చి నిన్నూ, నన్నూ కలిపి మోసగించిన ఈ నయవంచకుడిని అల్లరిపెట్టి అతని ఆస్తిలో వాటా నీకు రావలసింది వచ్చేలా చూసే పూచీ నాది. స్నేహితురాలిగా నీకు న్యాయం చేకూర్చి అతనికి శిక్షపడేలా చెయ్యడం నా విధిగా నేను భావిస్తున్నాను. నాకు కావలసింది ఈ విషయంలో నీతోడు, సహాయం మాత్రమే! ఇన్నాళ్లూ మన మన భావాలూ వేరైనా ఈ రోజు వాటిని దూరంగా నెట్టి ఒకటై, అసలు ఆడదంటే ఏమిటి, ఎవరు? అన్నది ఇలాంటి దగాకోరులకి తెలియజెప్పాలన్నదే నా ఉద్దేశ్యం. సహకరిస్తావు కదూ?

నీ

దివ్య."

ఉత్తరం చదివి ఆవేశంతో కలం, కాగితం తీసి దివ్యకి ఉత్తరం రాయడానికి ఉపక్రమించిన వల్లభని కోపంతో అదురుతున్న గుండె- 'పద ముందుకి దివ్యకి చేయూత నియ్యి' అంది.

●


వ్యాపార ప్రకటనలకు, చందా చెల్లింపులకు సంప్రదించండి -
ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, దోమలగుడా,
హైదరాబాద్ 500 029, ఫోన్ : 231974, ఫాక్స్ : 040-234632

లేదా

ఈ కింది నంబర్లను సంప్రదించవచ్చును.

| | ఫోన్ | ఫాక్స్ |
|---|---|---|
| బెంగుళూరు | 2866893 | 080-2866617 |
| కలకత్తా | 2430808 | 033-2205814 |
| కోయంబత్తూరు | 215251 | 0422-211320 |
| కొచ్చి (కొచ్చిన్) | 341215 | 0484-341799 |
| కోజికోడ్ | 766704 | 0495-765747 |
| మద్రాసు | 8520751 | 044-8520751 |
| మధురై | 628221 | 0452-627872 |
| ముంబయి | 2886940 | 022-2886954 |
| న్యూఢిల్లీ | 4627912 | 011-4627916 |
| తిరువనంతపురం | 63716 | 0471-69379 |
| విజయవాడ | 61351(అయిదు లైన్లు) | 0866-61204 |
| విశాఖపట్నం | 558769 | 0819-542964 |